క్లుప్తంగా

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి



పనులు పరిశీలిస్తున్న ఏపీడీ లక్ష్మీనారాయణ

గుడిబండ: మండల పరిధిలో పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ లక్ష్మీనారాయణ, ఏపీఓ భార్గవి సూచించారు. సోమవారం తాళికెర పంచాయతీలో జరుగుతున్న మినీ అమృత్ సరోవర్ ఉపాధి పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించారు. నాలుగు రోజులు నుంచి వర్షం పడుతుండటంతో భూమిలో తేమ శాతం ఉందని పనులు చేయడానికి ఉపాధి కూలీలకు ఎంతో అనుకూలంగా ఉందన్నారు. ఈసీ లక్ష్మీనారయణ, టీఏ వెంకటేష్ ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రొళ్ల: మండల పరిధిలోని జీఎన్ పాళ్యం గ్రామం సమీపం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా రవి అనే వ్యక్తి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ ద్వారా రత్నగిరి వైపు తరలిస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కేజీబీవీ పరిశీలన

గుడిబండ: మండలంలోని కరికెర కేజీబీవీ పాఠశాలను సోమవారం నోడల్ అధికారి ఆనంద్‌బాబు సందర్శించారు. ఈ సందర్భంగా నాడు-నేడు పనులను పరిశీలించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది సీఆర్టీ, పీటీఐ వారితో సమీక్షించారు. బడి బయట ఉన్న విద్యార్థులు, దివ్యాంగుల విద్యార్థుల గురించి చర్చించారు.

'పురం'లో కార్డెన్ సెర్చ్



హిందూపురం అర్బన్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో సోమవారం సాయంత్రం వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పలువురి ఇళ్లను తనిఖీ చేశారు. సీఐలు వీ. శ్రీనివాసులు, రియాజ్ అహమ్మద్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఉషశ్రీచరణ్ రాక

పరిగి: మంత్రి, పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఉషశ్రీ చరణ్ మంగళవారం మండల పర్యటనకు వస్తున్నారని మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక బీరప్ప ఆలయ కళ్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారన్నారు.

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున వెలసిన రుద్రపాద ఆశ్రమం వద్ద నేడు మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి ఉషశ్రీచరణ్ సమావేశమవుతారని మండల కన్వీనర్ తిమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

అదుపు తప్పిన లారీ



పొలంలోకి దూసుకెళ్లిన సిమెంట్ లారీ

మడకశిరరూరల్: కర్ణాటక రాష్ట్రం శిరా వైపు నుంచి వస్తున్న ఖాళీ సిమెంట్ మిక్సింగ్ లారీ మడకశిర మండలం గోవిందాపురం వద్ద సోమవారం తెల్లవారజామున అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం దెబ్బతింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. కేరళ నుంచి శిరా, మడకశిర మీదగా కర్ణాటకలోని బాగేపల్లికి వెళ్తుండగా ఈ ఘటన జరిగిందని స్థానికులు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

అమరాపురం: ఎన్నికల నియామళి అమలు ఉన్నందున మండలంలో ప్రజలు శాంతియుతంగా మెలగాలని అలా కాకుండా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ జనార్ధననాయుడు హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో కొంతమంది లూజు పెట్రోలు, డీజిల్ అమ్మకందారులతో ఆయన మాట్లాడారు. మండలంలో ఎక్కడా లూజ్ పెట్రోల్ అమ్మకాలు చేయకూడదన్నారు. అలాగే టపాసులు అక్రమంగా నిల్వ ఉంచితే సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రామంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సిరిమల్లె పువ్వ



- మల్లె పూల సాగుతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న రైతులు
- అగళిలో 80 ఎకరాల్లో సాగు
- రోజూ ఆదాయం లభిస్తుండటంతో అన్నదాతల హర్షం

అగళి: మల్లె వాసనకు మైమరచిపోని వారుండరు. మల్లెలు పెట్టుకోవడానికి ఇష్టపడని మహిళలు ఉండరు. అలంకారానికే కాకుండా ఔషధాలు, సెంటు తయారీల్లోనూ ఈ పూలు ఉపయోగపడతాయి. అందుకే వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అర్ధ ఎకరాలో పంట సాగు చేసినా ఖర్చులు పోను రూ. 2 లక్షలకు పైగానే ఆదాయం వస్తుండటంతో రైతులకు గిట్టుబాటు అవుతోంది.

120 ఎకరాల్లో సాగు

మడకశిర నియోజకవర్గంలోని అగళి మండలంలో మల్లె పూల సాగుకు ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 120 ఎకరాల్లో మల్లె పూలను రైతులు సాగు చేస్తుండగా.. ఇందులో ఒక్క అగళి మండలంలోనే 80 ఎకరాల్లో మల్లె పూలు సాగు చేస్తున్నారు.

ఆదాయం బాగు

అర్ధ ఎకరాలో మల్లె పూల మొక్కలు సాగు చేయాలంటే మొత్తం 200 మొక్కలు అవసరం అవుతాయి. పంట పెట్టుబడి, ఎరువుల ఖర్చు రూ.50 దాకా అవుతుంది. పంట వేసిన 9 నుంచి 12 నెలలలోపే మొక్కలకు పూలు వస్తాయి. ప్రతి రోజూ అర్ధ ఎకరాలోని మల్లె పూల మొక్కల ద్వారా మొదటి సంవత్సరం రోజూ 4 నుంచి 5 కేజీల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో మల్లెపూలు కేజీ కిలో రూ.400 పలుకుతున్నాయి. మల్లెపూలు తెంపడానికి కేజీకి రూ.వంద ఖర్చు అవుతుంది. మొత్తం ఐదు నెలల పాటు నిరంతరాయం మల్లెపూలు పూస్తుంటాయి. దీంతో రూ.3 లక్షలకు పైగా ఆదాయం రైతుకు వస్తుంది. అందులో ఖర్చులు పోను రూ.2 లక్షలకు పైగానే రైతులకు మిగులుతోంది.



నరసబుందిలో సాగు చేసిన మల్లె పూల తోట

10 ఏళ్ల పాటు ఆదాయం

మొదటి సంవత్సరం 4 నుంచి 5 కేజీలు రోజూ దిగుబడి ఉంటుంది. ఐదు నెలల తర్వాత దిగుబడి ఉండదు. అప్పటి నుంచి మరో నాలుగైదు నెలల పాటు పంటకు నీళ్లు కూడా పెట్టనవసరం లేదు. డిసెంబర్ నెలలో మళ్లీ మొక్కలను కత్తిరించి నీళ్లు పెడతారు. అలాగే ఎరువులు అవసరం అవుతాయి. ఆ ఖర్చులు లెక్కేసినా రూ.10 వేలకు మించి కావు. రెండో ఏడాది నుంచి ప్రతి రోజూ 10 కేజీల నుంచి 20 కేజీల వరకూ మల్లెపూల దిగుబడి ఉంటుంది. మంచి డిమాండ్ ఉన్నప్పుడు మల్లెపూలు తీయగలిగితే కేజీ రూ.వెయ్యి కూడా పలుకుతాయని రైతులు చెబుతున్నారు.

అగళి నుంచి మహారాష్ట్రకు ఎగుమతి

అగళి నుంచి మల్లెపూలు నిత్యం మహారాష్ట్రలోని కొల్హాపూర్, కర్ణాటకలోని దావణగెర, తుముకూరు, రాయచూర్, శిర మార్కెట్లకు మల్లెపూలను ఎగుమతి చేస్తుంటారు. మల్లెపూల సాగులో ఇంత వరకూ ఎవరికీ నష్టం రాలేదని, అందుకే తామంతా పూలు సాగుచేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

వేరుశనగతో నష్టపోయాం



వరుసగా వేరుశనగా పంట సాగు చేసి ఎప్పుడూ నష్టపోతుఉండే వాళ్లం. గత ఐదేళ్లుగా పూల తోటలు సాగు చేస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నాం. బోరు బావి కింద మల్లె తోట సాగు చేశాను. ఎరువులు, ఇతరాత్ర వాటి కోసం రూ.50 వేలు వరకు ఖర్చు పెట్టాను. ప్రస్తుతం మార్కెట్‌లో ధర అధికంగా ఉండడంతో రెండు లక్షల నుంచి రెండున్నర లక్షల వరకు ఆదాయం పొందుతున్నాను.

– నరసింహరాజు, ఆలూడి, అగళి మండలం

రోజూ ఆదాయమే...



బోరు బావి కింద అర్ధ ఎకరాలో మల్లె పూల మొక్కల సాగుచేశాను. మార్కెట్‌లో కేజీకి రూ 400 ధర ఉంటే ఖర్చులు పోనూ 5 నెలలో రూ. 2 లక్షలు పైగా ఆదాయం వస్తుంది. అదే మార్కెట్‌లో కిలో పూలకు 700, 900 ధర ఉంటే రూ. 3 లక్షకు పైగా ఆదాయం వస్తుంది. రోజూవారీగా ఆదాయం ఉండటంతో మా జీవితం సాఫీగా సాగిపోతోంది. 8 ఏళ్లుగా మల్లె సాగునే నమ్ముకొని బతుకుతున్నాను.

– రంగనాథ్ నరసబుంది, అగళి మండల

ఉన్న ఊళ్లోనే ఉపాధి



మల్లె పూల సీజన్ ప్రారంభం కావడంతో గ్రామస్థాయిలోనే ఉపాధి దొరుకుతోంది. పూలను విడిపించడాని కేజీకి రూ 100 ఇస్తారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ దాదాపు మూడు కేజీల నుంచి నాలుగు కేజీల వరకూ విడిపిస్తాం. రోజుకు రూ. 300 నుంచి 400 దాకా సంపాదించుకుంటాం. 10 నెలలు వరకూ ఉపాధి గ్రామస్థాయిలోనే దొరుకుతోంది.

– రత్నమ్మ, మధూడి, అగళి మండల

ఆధ్యాత్మిక యాత్రలో మంత్రి ఉషశ్రీచరణ్



కేదర్‌నాథ్ ఆలయం వద్ద మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇన్నాళ్లు బిజీ బిజీగా గడిపిన మంత్రి ఉషశ్రీచరణ్ పోలింగ్ ముగియడంతో ఆధ్యాత్మిక యాత్ర చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఉత్తరాఖండ్‌లోని కేదర్‌నాథ్, బద్రీనాథ్, రిషికేష్‌లోని దేవాలయాలను ఆమె సందర్శించుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి పదవి అలంకరించాలని, రాష్ట్ర ప్రజలతో పాటు పెనుకొండ ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని శివుడిని వేడుకున్నట్లు ఉషశ్రీచరణ్ 'సాక్షి'కి తెలిపారు.

ఇద్దరికి గాయాలు

అమరాపురం: మండలంలోని ఆలదపల్లి సమీపంలో పెట్రోల్ బంకు వద్ద రెండు వాహనాలు ఢీ కొనడంతో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలమేరకు... గుడిబండ మండలంలోని గొల్లహళ్లికి చెందిన రత్నమ్మ, భాగ్యమ్మ వారి బంధువు ద్విచక్ర వాహనంలో గొల్లహళ్లి నుంచి అమరాపురం వైపు వస్తున్నారు. ఇదే సమయంలో కర్ణాటక రాష్ట్రం మధుగిరి నుంచి బొలెరో వాహనంలో చెలికెర తాలుకా పరాశురామపురం దగ్గర ఉన్న బండె మారెమ్మ దేవస్థానానికి వస్తుండగా ఆలదపల్లి సమీపంలో ద్విచక్ర వాహనంలో వెళుతున్న వారిని బోలెరో వాహనం ఢీ కొంది. దీంతో భాగ్యమ్మ, రత్నమ్మ కింద పడ్డారు. వెంటనే వారిని మడకశిర ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి ఊరేగింపు



సడ్లపల్లిలో చౌడేశ్వరీదేవిని ఊరేగిస్తున్న దృశ్యం

లేపాక్షి: హిందూపురం మండలంలోని కొటిపి గ్రామంలో వెలిసిన చౌడేశ్వరీదేవి అమ్మవారిని మండలంలోని సడ్లపల్లిలో గ్రామస్తులు సోమవారం ఘనంగా ఊరేగించారు. ప్రతి ఐదేళ్లకొకసారి అమ్మవారిని గ్రామానికి తీసుకు వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున అమ్మవారికి గావు కార్యాక్రమం జరుగుతుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ స్వరూపరెడ్డి, సీహెచ్‌ఓ వన్నప్ప

పరిగి: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మెడికల్ ఆఫీసర్ స్వరూపరెడ్డి తెలిపారు. సోమవారం శాసనకోట ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేసి ఆస్పత్రి సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యాపించే వ్యాధులను నివారించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వన్నప్ప, ఏఎన్‌ఎం అనూరాధ పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు పూజలు



అలంకరణలో కనకదుర్గాదేవి

హిందూపురం: హిందూపురంలోని ముదిరెడ్డిపల్లి సుభాష్ నగర్‌లోని కనకదుర్గాదేవి ఆలయంలో వార్షికోత్సవ మహోత్సవాన్ని పురస్కరించుకుని పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే ఆలయ ఆవరణంలో గణపతి పూజ, కలశ స్థాపనచేసి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జోరుగా విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్

మడకశిర: నియోజకవర్గంలో రాయితీ వేరుశనగ విత్తనం కోసం రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. అన్ని ఆర్బీకేల్లో కూడా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. నియోజకవర్గంలోని 71 ఆర్బీకేల్లో రైతులు విత్తనం కోసం తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. రెండు రోజులకే 851 మంది రైతులు విత్తనం కోసం తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మొత్తం 722.7 క్వింటాళ్ల విత్తన కాయల కోసం రైతులు సోమవారానికి తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. మడకశిర మండలంలో 294 మంది రైతులు 249.3 క్వింటాళ్లు , అమరాపురంలో 38 మంది 33.9 క్వింటాళ్లు. గుడిబండలో 455 మంది రైతులు 384 క్వింటాళ్లు,రొళ్లలో 60 మంది రైతులు 51.9 క్వింటాళ్లు, అగళి మండలంలోని నలుగురు రైతులు 3.6 క్వింటాళ్ల విత్తన కాయలకు పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అధికారులు తెలిపారు.



హిందూపురం: విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతు

హిందూపురం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాయితీ విత్తన వేరుశనగకు సోమవారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు హిందూపురం మండల వ్యవసాయాధికారి సురేంద్రనాయక్ తెలిపారు. అర ఎకరా పొలం రైతుకు 30 కేజీల బ్యాగ్, ఎకరా పొలం ఉన్న రైతుకు 30 కేజీల బ్యాగులు రెండు, ఎకరా నుంచి పైనున్న రైతులకు 30 కేజీల బ్యాగులు 3 పంపిణీ చేస్తామన్నారు. 36 రకం విత్తనం 30 కేజీల ఒక బ్యాగ్ పూర్తి ధర రూ.2,850 ఉండగా అందులో సబ్సిడీ 40 శాతం రూ.1,140 పోనూ రూ.1,710 చెల్లించాలన్నారు.

రొద్దం: మండల వ్యాప్తంగా అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీ విత్తన వేరుశెనగ కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ శంకర్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఆధార్ కార్డుతో పాటు పట్టాదారు పాసు పుస్తకం తీసుకువచ్చి ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

పెనుకొండ: రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో అందించే విత్తన వేరుశనగ కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ చందన తెలిపారు. విత్తనం వచ్చిన వెంటనే పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు.

లేపాక్షి: రాయితీ వేరుశనగ విత్తనాల కోసం లేపాక్షి మండల వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని ఏఓ శ్రీలత తెలిపారు. మండలానికి 1800 క్వింటాళ్ల వేరుశనగ విత్తనం అవసరమని ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. అవసరాన్ని బట్టి మళ్లీ తెప్పిస్తామన్నారు. వేరుశనగ విత్తనం అవసరమైన రైతు సంబంధిత ఆర్బీకే కేంద్రాల్లో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోను తీసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

శాంతి భద్రతలను పరిరక్షించాలి

రొళ్ల: మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేలా ప్రత్యేక నిఘా పెట్టి శాంతి భద్రతలను పరిరక్షించాలని మడకశిర రూరల్ సీఐ రాజకుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. పాత పెండింగ్ కేసులు ఏమైన ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. అంగళ్లు, బంక్‌ల యజమానులు పెట్రోల్, డీజిల్‌ను లూజ్‌గా విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజశేఖర్, జమెదార్ రమణ, కానిస్టేబుల్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

మడకశిర: ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఓట్ల లెక్కింపు ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అర్బన్ సీఐ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. గొడవలు,అల్లర్లు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. కౌంటింగ్ రోజున ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

రొళ్ల: మండల పరిధిలోని హెచ్‌టీ హళ్లికి చెందిన బోయ తిప్పేస్వామి ఈనెల 12వ తేదీన అదృశ్యమైనట్లు ఆయన భార్య రత్నమ్మ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. తిప్పేస్వామి ఆచూకీ కోసం కర్ణాటక రాష్ట్రం మిడిగేశి, బడవనహళ్లి, పట్టనాయకనహళ్లి తదితర పోలీస్‌స్టేషన్లకు ఆయన ఫొటోను పంపి వెతికే ప్రయత్నం చేస్తామన్నారు.

విస్తారంగా వర్షాలు



అమరాపురం: గౌడనకుంటలో చెక్‌డ్యాంలో చేరిన వర్షపు నీరు

మడకశిర: నియోజకవర్గంలో ఆదివారం రాత్రి విస్తారంగా వర్షాలు కురిశాయి. అన్ని మండలాల్లో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమరాపురం మండలంలో భారీ వర్షం కురిసింది. మండలంలో 75.8 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో వాగులు, వంకలు పారాయి. చెక్‌డ్యామ్‌లు నిండాయి. అదే విధంగా గుడిబండ మండలంలో 21.6, అగళి మండలంలో 18.6, రొళ్ల మండలంలో 15.4, మడకశిర మండలంలో 10 మి.మీటర్ల చొప్పున వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

అమరాపురం: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెక్ డ్యాంలలో నీరు నిండటంతో నీటికి ఇబ్బంది లేదని అంటున్నారు. పదునైన వర్షాలు కురవడంతో దుక్కి చేయడానికి అనుకూలంగా ఉంటుందన్నారు.

గుడిబండ: మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం, రాత్రి భారీ వర్షం కురిసింది. మద్దనకుంట, ముతుకూరు, దేవరహట్టి పంచాయతీల్లో చెక్‌డ్యాంలు నిండి వంకలు ప్రవహించి కుంటలకు వర్షపు నీరు చేరింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

టీ బంక్ పై కూలిన చింత చెట్టు

రొళ్ల: మండల పరిధిలోని మల్లినమడుగు గ్రామంలో ఆదివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. ఇదే గ్రామానికి చెందిన లక్ష్మమ్మ ప్రధాన రోడ్డు పక్కన టీ బంక్ పెట్టుకుని జీవనం సాగించేది. అయితే ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత టీ బంక్ వెనక భాగానే ఉన్న భారీ చింత చెట్టు బంక్‌పై కూలింది. దీంతో రూ.లక్ష వరకూ నష్టం జరిగిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. చెట్టు పడిన సమయంలో టీ బంక్‌లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

వక్క తోటలు వర్షార్పణం

పావగడ: తాలూకా వ్యాప్తంగా ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు అరసికెరె గ్రామంలో సుమారు 150 వక్క తోటల్లో వందలాది వక్క చెట్లు నేల కూలాయి. ఈ సందర్భంగా అరసికెరె గ్రామానికి చెందిన బాధిత రైతు గడినాడు రైతు సంఘం అధ్యక్షుడు మల్లేశప్ప మాట్లాడుతూ గాలి వాన బీభత్సానికి అధిక సంఖ్యలో వక్క చెట్లు, టెంకాయ చెట్లు నేల కూలాయన్నారు. సుమారు రూ 10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. నష్ట పరిహారం చెల్లించి ప్రభుత్వం తమను ఆదు కోవాలని బాధిత రైతులు హులియప్ప, వీరేంద్ర, మరళు సిద్దయ్య, చంద్రప్ప, దొడ్డయ్య, రెడ్డి తదితరులు విన్నవించుకున్నారు. స్థానిక ఉద్యానశాఖ అధికారి విశ్వనాథగౌడ, రెవెన్యూ అధికారులు దెబ్బతిన్న వక్క తోటలను పరిశీలించి నష్ట పరిహారాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు చెప్పారు.



గుడిబండ: చెక్‌డ్యాం నిండిన దృశ్యం



నేల కూలిన వక్క చెట్లు



మల్లినమడుగులో టీబంక్ పై కూలిన చింత చెట్టు